మధ్యవర్తిత్వము

కాళూరి వెంకటరామారావు

౧

రామసోమయాజిపేరు చెబితే కళ్లేపల్లి అగ్రహారంలో పిట్టలు నీళ్లుతాగవు. తండ్రితాతలు యజ్ఞాలుచేసినందుచేత వంశక్రమాగతంగావచ్చినపౌరుష నామమే నిల్చిపోయిందిగాని అతనికి వైదిక ప్రవృత్తి మొదటినించీ లేదు. పూర్వార్జితపు ఆస్తి కొంతఉంది అతనికి. వేదమూర్తులై ప్రభువుల వార్షికాలవల్ల సంపాదించిన క్షేత్రములవి. దాన్ని జాగ్రత్తపరుచుకుంటూ జీవిస్తే ఆకుటుంబానికి కేవిధమైన లోటూ ఉండక పోయేదే.

చిన్నప్పటినించీ సోమయాజిమనసు వైదికం వేపుకంటె లౌక్యంవేపే ఎక్కువమొగ్గు చూపింది. తండ్రి చనిపోగానే అతని కేవిధమైన అడ్డూ లేకుండా పోయింది. ఊళ్లోనూ, చుట్టుపక్కలా తగువులు బయలుదేరితేచాలు రామసోమయాజి అక్కడ వాలాడన్నమాటే. ఏదోఒకపార్టీని వెనకేసుకుని కోర్టుకెక్కించేస్తేగాని అతనికి నిద్రపట్టేదికాదు.

తేజోవంతులై, ఏపరిస్థితుల్లోనూ వీథిఅరుగుదిగకుండా శిష్యవర్గానికి పాఠాలుచెప్పుకుంటూ శ్రీమంతుల మన్ననలందిన వేదమూర్తులు అతని పెద్దలు. జీవించిన యెనభైతొంభైయేళ్లలోనూ పూటకూళ్ల భోజనం రుచి యెరగవు వారి జిహ్వలు. కోర్టుసమ్ముఖం తొక్కనే లేదు వారి పాదాలు.

రామసోమయాజులు క్రమంగా పెద్దవ్యవహారస్థుడైపోయాడు. విజయనగరం, విశాఖపట్నంకోర్టు వకీళ్ల కతనిరాక కళ్లపండుగ. నెలకి యిరవైతొమ్మిది రోజులు ఇంట్లో విస్తరివెయ్యడపు అలవాటు అతనికి లేదు. అతడంటే ప్రతివాడికీ భయమే.

రోజులవెంబడిని సోమయాజి లౌక్యజ్ఞానమెక్కువైపోయింది. ఇతరుల వివాదాలలో తిరిగి ఆర్జించిన వ్యవహారజ్ఞానము అతనిబుద్ధిని స్వవిషయం వంకకు తిప్పింది. కొంతభూమి వారసత్వరీత్యా తనకు రావాలని ఒక మారపుజ్ఞాతిమీద దావాపడేశాడు.

కోర్టు యిల్లయిపోయిన సోమయాజితో తంటాలు పడలేదు. దావాఖర్చులకోసం యిల్లు గుల్లచేసుకోవడం యిష్టంలేదు. న్యాయం తనవేపే ఉందని స్పష్టంగా తెలిసినప్పటికీ ఆజ్ఞాతి రామసోమయాజితో రాజీపడిపోయేడు. అందుమూలంగా సోమయాజికి నాలుగుయెకరాల పల్లపుభూమి కలిసొచ్చింది.

శ్రమలేకుండా పొందిన ఈ ప్రథమవిజయము అతన్ని ఉత్సాహపూరితుణ్ని చేసేసింది. వెంటనే మరి నాలుగు దావాలు మరికొందరిమీద పడేశాడు వాళ్ల స్థిరాస్తులు తనకి స్వాధీనపరచమని.

సోమయాజి అనుకున్నంత చాలాగ్గా తేలిపోలేదీవ్యాజ్యాలు. నలుగురూ యేకమై సోమయాజిసత్తువ చూడాలనుకుని ప్రతివాదన సాగించారు. కొన్ని జిల్లాకోర్టునూ, కొన్ని హైకోర్టునూ చూశాయి వ్యాజ్యాలు. ఎందులోనూ నెగ్గలేకపోవడంసరికదా, వాటిలో అయినఖర్చులు సోమయాజియింటికీ వాకిలికీ యెసరుపెట్టాయి. ఏబాధ్యతలూ లేని అతనిఆస్తి ఋణముల భారాన్ని మూలగడం ప్రారంభించింది.

సోమయాజికి నలుగురు కుమాళ్లూ, యిద్దరు కుమార్తెలూను. విశ్వేశ్వరశాస్త్రి అతని పెద్దకుమారుడి పేరు. ఇప్పుడు శాస్త్రి విజయనగరంకాలేజీలో బి. ఏ. చదువుతున్నాడు. అతనికి వివాహమై నాలుగేళ్లయింది. అతని అత్తవారి ఊరు "గరికివలస" విజయనగరానికి పదిమైళ్ల దూరంలో ఉంది.

ఒకప్పుడు విజయనగరంమహారాజావారు వేటాడి, పరివారమునుండి వేరయిపోయి, చీకట్లో దారితప్పి గరికివలస చేరుకున్నారు జాముర్రాత్రివేళకి. శ్రాంతుడైన రాజు గుర్రాన్ని వీథిలో చెట్టుకి కట్టేసి ఒక బ్రాహ్మణ

యింటి అరుగుమీద కూర్చున్నాడు. ఆయింట్లో ఒక వృద్ధురాలుమాత్రం ఉన్నది. ప్రభువుని గుర్తించలేదు గాని ఇంటికివచ్చిన అతిథి అభోజనుడై ఉండటం ఆవిడ కిష్టంలేకపోయింది. ఇంట్లో కూరగాయలైనా లేని పేదరాలు. అతిథిసత్కారానికి మాత్రం దరిద్రమెరగని హృదయ మావిడది.

పెరట్లో పాముమీసాలవలె పెరిగిన గరికె యింత కోసుకొచ్చి పచ్చడిచేసి ఊరగాయతో భోజనం పెట్టింది అతిథికి. క్షుధార్తి రాచకీవినిసహితం మరిపించేసింది. అవ్వ విశేషబలవంతం చెయ్యనక్కరలేకుండానే మహా రాజు భోజనానికి లేచాడు.

కుచేలుడి అటుకులు శ్రీకృష్ణుడికి పూర్ణసంతృప్తిని కలిగించాయి. పశువులుతినే గడ్డిలోసహితం రుచి పుట్టించగల వృద్ధురాలి పాకనైపుణ్యానికి మెచ్చింది పంచభక్ష్యాన్నములను మెచ్చని శ్రీమంతుడి జిహ్వ. చేతికి యెముకలేని దానకర్ణుడు మహారాజు. ఆగ్రామాన్ని అగ్రహారంగా దానపట్టా రాసి యిచ్చేశాడు. గరికిపచ్చడివల్ల పుట్టిందిగనుక "గరికివలస" అని పేరు.

ఇప్పటిడా అగ్రహారంలో ఏడెనిమిది బ్రాహ్మణ కొంపలుమాత్రం మిగిలిఉన్నాయి. చదువులకీ, ఉద్యోగాలకీ, యాచనావృత్తికీ గరికివలసలోని బ్రాహ్మణ్యం అంతా దేశాంతరాలకి చెదరిపోయింది.

గరికివలసఅగ్రహారంలో అవధానులు గారి దొక్కచేటే లోటులేని సంసారం. ఆయనకి సుందరమ్మ ఒక్కర్తే కుమార్తె. ఇంట్లో ఖర్చు తక్కువచేతా, ఆయనభార్య మహాలక్ష్మమ్మ తెలివితేటలచేతా అవధానులఆస్తి బాగా వృద్ధిపొందింది. ఆయన బతికిఉన్నప్పుడేనా ప్రతివిషయంలోనూ మహాలక్ష్మమ్మదే ఆఖరు మాటగా సాగింది.

మహాలక్ష్మమ్మ విశాఖపట్నంలో కోస్తాకంపెనీల యేజెంటుగా పనిచేసి విశేషధన మార్జించిన మహేంద్రసోమయాజులుగారి కుమార్తె. పట్నవాసపు పిల్ల. శక్తిసామర్థ్యములుగల మెదడు. అవధానులావిడ మాట కెదురుచెప్పలేకపోయేవాడు. ఏ వేదం చదువుకున్నవాడికో కూతురునిచ్చి పెళ్లిచేసి అల్లుణ్ణి యిల్లరికం తెచ్చుకోదలచుకున్న అవధానులు ఆవిడపట్టుమీదనే సుందరమ్మని అప్పటికి స్కూలుఫైనలు చదువుకుంటూన్న విశ్వేశ్వరశాస్త్రి కిచ్చి వివాహంచేశాడు.

అప్పులబాధతో కృశించిపోతూఉన్న తన ఆస్తికి అవధానులుగారి నిలవడబ్బు సంజీవనీఔషధంలాగు కనబడ్డాది సోమయాజులికి. పెళ్లిఅయిన సంవత్సరం నాడు సుందరమ్మ పెద్దమనిషయింది. ఇంతలో అవధానులు చనిపోయాడు.

తగినసమయం కొరికిందికదా అని మధ్యవర్తుల చేత సోమయాజి కబురు పంపాడు మహాలక్ష్మమ్మకి. ఆమెవద్ద ఉన్న నిలవసొమ్ముతో తన ఋణములు తీర్చవలసిందని. ఉన్నఆస్తి ఏమాత్రమైనా కూతురుకీ, అల్లుడికేకదా ఇవ్వదలచుకుంది? అలాంటప్పుడు అల్లుడి భూములు అప్పులపాలై పోతూఉంటే కాస్తసహాయ పడమని కోరడంలో తప్పేమున్నది?

ఆమదిఅయినా మహాలక్ష్మమ్మ అంతసులభంగా లొంగిపోలేదు సోమయాజులుకి. కోరినట్లూ సొమ్ము రాకపోయినప్పుడు కోడలింక తనసుమ్మంతోక్కడానికి వీల్లేదనిఅతడు బెదిరించాడు. "నాఆస్తి నాకుమార్తెకి యిచ్చుకుంటానుగాని మీఋణాలన్నీ తీర్చడానికి నాకవసరములేదు. మీకు దయఉంటే కార్యంచేసుకొండి. లేకపోతే నాపిల్ల మాయింట్లోనే ఉంటుంది" అని ఆమె వియ్యంకుడికి జవాబుచెప్పింది.

తనపేరుచెబితే హేమాహేమీలు గడగడలాడుతూఉంటే కేవలం ఒకస్త్రీ, అందులోనూ పిల్లనిచ్చుకున్నది అల్లా యెదిరించడంచేత సోమయాజులశరీరం మండుకుపోయింది. తనమాటలేనిదే అత్తవారితో ఉత్తరప్రత్యుత్తరాలుగాని, వాళ్లయింటికి వెళ్లడంగాని జరగరాదని కుమారుడికి ఆర్డరిచ్చేశాడు.

౨

పైవిషయాలు జరిగి రమారమి రెండుసంవత్సరాలు గతించాయి. సుందరమ్మ వ్యక్తురాలయికూడా రెండేళ్లు దాటాయి. ఉన్న ఒక్కకుమార్తెవల్లనైనా,

అల్లుడు యింటికి రావడం పోవడం మొదలైన ముద్దు ముచ్చట్లు తీరలేదు మహాలక్ష్మమ్మకు.

వియ్యంకుడి మనస్సు తిప్పడానికి పెద్దమను ష్యులద్వారా అనేకసార్లు ప్రయత్నించింది. తను స్వయంగా కళ్లేపల్లిఅగ్రహారానికి వెళ్లి ప్రార్థించింది. సోమయాజులగుండె చలనమన్నదే యెరగని పాషాణము.

మహాలక్ష్మమ్మ తల ఆలోచనల పాతర. వియ్యంకుడి నిరాదరణతో ఆమె అధైర్యము పొందలేదు. విజయనగరంలో చదువుతూన్న అల్లుడికి గరికివలస ఒకసారి రావలెనని కబుర్లుపంపించింది. అతను రాకపోయినప్పటికీ పండుగపర్వాలకు బహుమతులకింద కొంతడబ్బు పంపిస్తూఉండేది.

నిరంకుశుడైన తండ్రికి జడిసి విశ్వేశ్వరశాస్త్రి అత్తవారింటికి వెళ్లడానికి సాహసించలేకపోయాడు. సంతతానందప్రదమగు యౌవనద్వారాన్ని సమీపించిందతని వయస్సు. నిత్యవసంతశుభోదయమున జీవితమధుర రసాస్వాదనమునకు త్వరపడుతూంది హృదయము అతని ప్రయత్నం లేకుండానే.

వివాహంలో ఏంచూశాడో అంతేగాని ఈనాలుగేళ్లా యా శాస్త్రి మరి భార్యముఖమునుచూచి ఎరగడు. ప్రాపంచికకాలుష్య మేమాత్రమూ అంటని విశాల హృదయ మతనిది. ఉన్నతవిద్యవల్ల సంస్కారమును పొందిన జ్ఞానము. పవిత్రప్రేమమందు ఏ అభ్యంతరములనూ పాటించని నూత్నయౌవనము.

తండ్రికోరికలో ఉన్న అసందర్భాన్ని అతడు నిముషంలో గ్రహించాడు. అతని క్రూరత్వానికి అసహ్యించుకున్నాడుకూడా. కాని ఆచండశాసనుణ్ణి ఎదురుకునే ధైర్యంమాత్రం చాలదు.

పెళ్లిదుస్తులతో తీయించుకున్న సుందరంఫోటో అతనిపెట్టెలో ఉంది. అప్పటి కామె పదమూడేళ్ల పిల్ల. లక్ష్మీకళ లీనుతూఉండే పసుపుబట్టలూ, అమాయకత్వముస్ఫురించే ముఖమూ, నిష్కలుషమగు ప్రేమను ప్రతిఫలించే కాటుకకళ్లూ, బాల్యకాల చిహ్నములపైని అప్పుడప్పుడే స్ఫురిస్తూఉన్న యౌవనముద్రలూ కలిగి ఫోటోలో ఉండీకూడా సుందరిసౌందర్యము శాస్త్రి హృదయంపైని వశీకరణమంత్రాలను ప్రయోగించేది. ఆఫోటోలో ఉన్న పిల్ల యిపుడు యెదట నిలబడితే తాను పోల్చుకోగలడా? ఆమె యిప్పుడెలాగున్నాదో ఒకసారి చూడ్డానికైనా తనకి అవకాశం లేదుకదా అని అతను చాలా విచారించాడు

భార్య వ్యక్తురాలయి తన్ను కలియక పూర్వం అత్తవారింటి అనుభవముల మాధుర్యమును రుచిచూసిన పాఠకు లెందరున్నారో తెలియదు. కాని ఆ ఆనందము అనిర్వచనీయము, అద్వితీయము. అది కరువైపోయింది శాస్త్రికి. రాత్రివేళ చదువుముగించి పక్కమీద శరీరం వాల్చినతరవాత నిద్రపట్టేవరకూ, ఆపిమ్మట స్వప్నవీథులలోనూ, భావనాప్రపంచంలోనూమాత్రం అతనికీసౌఖ్యం కొంత లభిస్తూఉండేది.

రమారమి ఏడాదినించి భార్యను ఒకసారి చూసి తీరాలన్నకోరిక అతనిలో గాఢంగా వేళ్లుపారింది. "తండ్రికి తెలియకుండా గరికివలస వెళ్లి అత్తవారింటి ముందునించే వెళ్లిపోతూ లోపలికి ఒక్కసారి చూస్తే సుందరం కనబడకపోతుందా? ప్రేమదేవత దివ్యవాణి ఆమె హృదయాన్ని ప్రమోగించడంచేత నేను వెళ్లేసమయానికి సరిగ్గా సుందరం వాళ్ల వీథిఅరుగుమీద స్తంభాని కానుకుని నిలబడి ఉంటుందేమో? నన్నావిడ గుర్తించకుండా నేనుమాత్రం ఆవిణ్ణి కళ్లారా చూసి ఏమీ యెరగనట్లు మళ్లీ వచ్చేస్తే తప్పేముందీ? తరవాత దైవకృపవల్ల యిద్దరమూ కలుసుకున్నప్పుడు ఆమెకీ సంగతి నేను జ్ఞాపకానికి తేవచ్చును. తాను నన్ను పోల్చుకో లేకపోయినందుకు వేళాకోళంకూడా చేయవచ్చు." ఇవీ ఆలోచనలు.

లేదా, అత్తగా రంతప్రేమతో అన్నిసార్లు వర్తమానం చేస్తున్నపుడు ఒక్క సెలవురోజున వాళ్లింట్లో ఉండి వస్తేమాత్రం ప్రమాద మేమిటి? ఇంతా తెగించి వాళ్ళ ఊరు వెళ్లి ఒక్కపూటైనా వాళ్ల యింట్లో ఉండకుండా రావడానికి వాళ్లుచేసినద్రోహ మేమిటి?

నాకు సుందరాన్ని చూడాలని ఎంత ఉందో ఆవిడకి మాత్రం నన్ను చూడాలని అంత ఉండదూ? దైవం మాత్రం అంగీకరిస్తాడా? తీరా నేను వెళ్లేసరికి సుందరం వీథి అరుగుమీద ఉండకపోతే? వాళ్లవీథితలుపులు మూసేసిఉంటే? అంతా వృథాప్రయాసేగా? నాన్న ఏమనుకున్నా సరే. వెళ్లి తీరాలి"

సంవత్సరంనించి ప్రతిరాత్రీ ఈ నిశ్చయం చేసుకుని, అక్కడికి వెళ్లిన తరవాత తను ప్రవర్తించవలసిన విధానమును గూర్చి ఊహించుకుంటూనే అతడు నిద్రపోతున్నాడు. మనసు తెగించడం లేదు.

3

శ్రావణపౌర్ణమి శుక్రవారంనాడు రావడంచేత శనివారాదివారాలతో కలిసి వరసగా మూడు రోజులు కాలేజీకి సెలవులు. ఈ రోజుల్లోనైనా తప్పకుండా అత్తవారింటికి వెళ్లాలని దృఢసంకల్పంతో చాలా రోజులనించీ ఎదురుచూశాడు శాస్త్రి.

అత్యాత్రముతో నిరీక్షించిన శ్రావణపౌర్ణమి వచ్చింది. విద్యార్థులు చాలామట్టుకు స్వగ్రామాలకు వెళ్ళినందువల్ల హాస్టలులో సమ్మర్దము తక్కువగా ఉంది. గరికివలసప్రయాణానికిదే సమయమనుకున్నాడు విశ్వేశ్వర శాస్త్రి.

ఉదయం ఎనిమిదిగంటలింకా కాలేదు. ఆకాశము నిర్మలమై, విశాలమై, తేజోవంతమైఉంది. అక్కడక్కడ స్వచ్ఛధవళములైన అంచులుగల మేఘాలు ఉన్నాయి. వాటిగర్భములందు మాత్రం కొంచెమంత నలుపురంగుగల నీటిబిందువులు ఉన్నవి. త్వరలో వర్ష సూచనలు లేవు. జీవకోట్లకి ఉత్తేజమును ప్రసాదిస్తూంది ప్రకృతి యావత్తూను.

వైదికకుటుంబంలోవాడు కాబట్టి పౌర్ణమిపూటా గెడ్డం గీసుకోడానికి మొదట కొంత సందేహించాడు శాస్త్రి. కాని ప్రయాణం తలపుకి వచ్చినపుడు గెడ్డం చేసుకోకుండా వెళ్ళడానికి మనసు ఒప్పడంలేదు. మంగలివాడు ముట్టుకోకుండా ఉంటే తప్పులేదని మనసును సమాధానపరచుకుని తనే గెడ్డాన్ని శుభ్రపరుచుకుని స్నానంచేశాడు. బట్టలు కట్టుకోవడం అతడంత అలవాట్ని అంతకుముందెన్నడూ చేసి యెరగడు. ఆవర్ట పనికిరాదని యిదీ, ఈ ఖండువాని మెచ్చకయింకొకటీ, పంచ బాగులేదని మరొయీ, అది నచ్చక మళ్లీ పంచా గంటసేపు పట్టింది డ్రెస్సువేసుకొని తయారయేసరికి.

ఉన్నత విద్య హృదయంతోపాటు వేషభాషలనుకూడా సంస్కరించడంచేత శాస్త్రికి నాగరికుల్లో స్థానంలేకుండాపోలేదు. పల్లెటూరు ఆరోగ్యమూ, కాంతీ, అమాయకత్వమూ, పట్నవాసపు నాగరికతా, తెలివితేటలూ అతనిలో సౌఖ్యంగా మిళితమైపోయాయి.

అప్పుడే సింహాచలంనుంచి వచ్చిన పూలజాతులను కొనుక్కుని, దేవీదుకాణంమీద మిఠాయిపొట్లాం కట్టించి శాస్త్రి సైకి లెక్కేసరికి ౯మారమి తొమ్మిది గంటలయింది. బాగా శృంగారించుకుని పేరంటాళ్ళని పిలుచుకోడానికి పోతూఉన్న పదహారేళ్ళ అమ్మాయి ఒకర్తె అతని కెదురుగా వచ్చింది.

పట్టణం సరిహద్దులను దాటింది మొదలుకుని ప్రకృతి సౌందర్యములో మునకలేస్తూ ఉన్న పరిసరాల్లోనించి సాగుతుంది రోడ్డు. రెండు వేపులా పచ్చని కొండలు; మధ్యమధ్య గెడ్డలు; వంతెనలూ ఏళ్లూ దాటి శరవేగాన్ని పోతూంది సైకిలు.

అడావిడితో నిండి విసుగెత్తించిన పట్నం విడిచిపెట్టిన తర్వాత యీ ప్రశాంత ప్రకృతి సౌందర్యమతని హృదయానికి నిర్మలానందాన్ని సమకూర్చి, మార్గాయాసం తోచనియ్యలేదు అతని రిస్టువాచీలో పదిగంటలింకా కానేలేదు శాస్త్రి గరికివలస కోనేటి గట్టుమీద సైకిలు దిగేసరికి.

కోనేటికీ ఊరుకీ మధ్య రెండు ఫర్లాంగులకంటె యెక్కువ దూరం లేదు. బ్రాహ్మణరేవులో ఒకరిద్దరు స్త్రీలు నీళ్లుముంచుకుంటున్నారు. చుట్టుప్రక్కల ఇతర జనసంచారం లేదు.

మఘకార్తెయెండ చుర్రుమంటూ తగిలినందుచేత శాస్త్రికి నుదుటిమీద చెమటపోసింది. కోనేట్లో

దిగి కాళ్లూ, ముఖమూ కడుక్కుని ఇన్నినీళ్లు తాగి తిరిగీ గట్టుమీద కొచ్చాడతను. జేబురుమాలుతో తడి ఒత్తుకుంటూ చల్లగాలి అనుభవిస్తూ నిలబడ్డాడు.

వివాహానికి వచ్చినపుడు వాళ్లు ఆ చెరువుగట్టు మీద, అతడు నిలబడిఉన్న మర్రిచెట్లకిందనే ముందుగా బళ్ళతో దిగారు. ఆడపెళ్లివారొచ్చి ఆహ్వానించేదాకా ఆ చెట్లనీడలలో జంబుకానాలు పరిపించి భోగముమేళం చేయించారు. అతను నిల్చున్న చోటునుండీ అగ్రహారపు బ్రాహ్మణవీథి కనిపిస్తూనేఉంది. పెళ్లి అయిదురోజులూ వాళ్లు విడిదిదిగిన బోర్డుస్కూలు బంగాళా చెరువుకీ ఊరుకీ మధ్యదారిలో ఉంది. ఏనాళ్లకి వచ్చినపుడు అతడు బ్రాహ్మణరేవులోనే స్నానంచేసేవాడు.

నాలుగు సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ఈ స్థలాలన్నీ సుపరిచితములై కనబడి శాస్త్రిహృదయంలో తియ్యని భావాలను రేకెత్తించాయి. అత్తవారింటికి వెళ్లడమా, మానడమా అని అంతదూరంవచ్చాక అతని కొకసందేహం కలిగింది. కాని అది ఒక్క నిముషం మాత్రమే. ఖండువా మళ్లీ సరిచేసుకుని, నుదుటిమీద పడుతూ ఉన్న క్రాపింగును ఒక్క తలవిసురుతో వెనక్కి తోసేసి మళ్లా సైకిలెక్కాడు. బ్రాహ్మణవీథి మలుపుతిరిగి రెండుయిళ్లు దాటగానే అతని అత్తవారిల్లు వున్నది.

౪

విశ్వేశ్వరశాస్త్రి ఇంట్లో ప్రవేశించేసమయానికి సుందరమ్మ దేవుడిగదిలో లక్ష్మీపూజ చేసుకుంటూంది. పూజచేయించే బ్రాహ్మణుడు చదువుతూఉన్న మంత్రాలు సావిట్లో కూర్చున్న శాస్త్రికి వినబడుతూనే ఉన్నాయి. చాలాకాలంకిందట చూసినందుచేత మొదట అత్తగారు అతన్ని పోల్చుకోలేకపోయింది. కాని కొంచెంసేపటిలోనే గ్రహించి ఉచితరీతిని మర్యాదచేసింది. క్షేమసమాచారాలన్నీ మాట్లాడుకున్నారు. ఇంతలో వ్రతకల్పం చేత్తో పట్టుకుని లోపలనించివస్తూ బ్రాహ్మణుడు శాస్త్రివేపు వింతగా చూసి వీథిలోకిపోయాడు.

లక్ష్మీపూజని పూర్తిచేసి లేవగానే కుమార్తెకు అల్లుడు వచ్చినవార్తను మహాలక్ష్మమ్మ తెలియచేసింది. తల్లి వంటయింట్లోకి వెళ్లిపోనిచ్చి సుందరమ్మ మళ్లీ లక్ష్మీదేవిపీఠముదిక్కు తిరిగి జోడించిన చేతులతో, ఇనుమడించిన భక్తితో, కృతజ్ఞతాపూరితహృదయంతో రెండునిముషాలు ధ్యాననిమగ్న అయిపోయింది. ఆమె పూజ ఫలించింది.

భోజనంచేస్తున్నంతసేపూ పక్కనున్న గవాక్షములోనించి సుందరిదృష్టులు రాకరాకవచ్చిన భర్తను ముంచివేశాయి. ఆమెమనసులో సంతృప్తి, ఆనందమూ, ప్రేమా వెల్లివిరిసిపోయాయి. సుందరి జ్ఞానవంతురాలు. భర్తరాక ఆమె కొక అనిర్వచనీయమగు మానసికోన్నత్యాన్ని కలిగించింది.

తనవిశ్రాంతికోసం యేర్పడిన పడకగదిలో డ్రాయరుమీద తమలపాకుల మడతలుంచి తిరిగీ పైకి వచ్చేటప్పుడు చూశాడు భార్యను మొట్టమొదటిసారి శాస్త్రి.

ఆమె కిపుడు పద్ధెనిమిదోయేడు ప్రవేశించింది. వసంతఋతువున పల్లవితమైన లేమావిగున్నవలె ఆమె సౌందర్యము పరిపూర్ణమై నేత్రోత్సవ మొనగూర్చింది శాస్త్రికి. ఉదయాన్నే తలంటుకుందికామోసు వదులు వదులుగా ఉంది పొడుగైన జడ. ముంగురులు చెప్పిన మాట వినకుండా పసుపునిగ్గులుదేరిన ముఖంమీద పడుతున్నాయి. లక్ష్మీపాద సంస్పర్శచే ధన్యతనందినది ఒక్కటే గులాబిపువ్వు ఆమెసిగలో ఉంది. పూజాసమయాన్ని ధరించిన బనారసుచీరమీద ఉన్న జరీపనియును, ఇతరబంగారునగలును శరీరచ్ఛాయలలో కలిసిపోయి ఆమె నొకబంగారువిగ్రహంగా మార్చేశాయి. మెడకింద గంధపురేకలు, కళ్లని కాటుక, పాదాలకి పారాణి. ఆమెను చూచేసరికి శాస్త్రిహృదయం నిండి పొర్లిపోయింది.

గదిగుమ్మందాటగానే యిద్దరూ దగ్గరైపోయారు. ఒకరినొకరు చూసుకోడానికి హృదయాలు తొందరపడ్డాయి. దృష్టులు హఠాత్తుగా కలుసుకున్నాయి. సుందరం తటాలున చూపు మళ్లించుకుని వెళ్లిపోయింది.

మధ్యాహ్నం నాలుగుగంట లవుతుంది. నిద్రలేచి ముఖంకడుక్కుని దక్షిణపువేపు గదిని ఆనుకొనిఉన్న

వసారాలో పడకకుర్చీమీద కూర్చున్నాడు శాస్త్రి. అతని కెదురుగా గోడపక్కని ఒక తుంగచాప పరిచి ఉంది. ఒకసారి చూస్తే చాలుననుకున్న అతనికోరిక లిప్పుడు మరికొంత ముందుకి సాగి సుందరితో సంభాషించడానికి కుతూహలపడుతున్నవి. కాని అది సాగే మార్గం ఏది?

ఇల్లా ఆలోచించుకుంటూ పరధ్యానంగా ఉన్నాడతను. ఇంతలో అతనిపక్కనే ఉన్న తలుపు మెల్లిగా తెరుచుకుంది. పకోడీలతో గాజుపళ్లెమూ, ఓవల్టయినుతో వెండిగ్లాసూ కల ఒక వెండికంచాన్ని అతని సమీపంగా పెట్టి సుందరి మందగమనంతో వెళ్లిపోయింది. సుంశ్రమై, నున్నమై మెద్రాసుగాజులతో అలంకరించబడిన ఆమెచెయ్యిమాత్రం శాస్త్రిని మురిపించింది.

మరి పావుగంట పోనిచ్చి మహాలక్ష్మమ్మ వచ్చి గోడప్రక్కనున్న చాపమీద కూర్చుంది. సోమయాజి దౌర్జన్యాన్ని ఆమె స్పష్టంగా విప్పిచెప్పేసింది. అన్నాళ్లు అల్లుడు రానందుకు విచారించింది. ఆవిడమాటలు విన్న శాస్త్రికి 'స్త్రీలలోకూడా ఇంత వ్యవహార జ్ఞానం కలవాళ్లుంటారా' అనిపించింది.

ఇలాగ పదినిముషాలు జరిగేసరికి గది తలుపువెనక నించి గాజుల చప్పుడువిన బడ్డాది. మహాలక్ష్మమ్మలోపలికిచూసి చిరునవ్వుతో "దా అమ్మా! యిలా వచ్చికూచో, పరవా లేదు. రా!" అన్నాది కుమార్తెతో, అల్లా రెండు మూడుసార్లు ఆమె నిర్బంధించిన మీదట సుందరం ఇంచుక సిగ్గుతో, వొయ్యారపు నడకలతో వచ్చి తల్లి పక్కనే కూర్చుంది.

ఈయేర్పాట్లన్నీ మహాలక్ష్మమ్మ ముందుగా ఆలోచించి చేసినవే అని శాస్త్రికి తెలుస్తూనేవుంది. కాస్తంతసేపు నిలకడగా ప్రియురాలిని చూడ్డాని కతని కప్పుడు కొంత అవకాశం కలిగింది. అత్తగారి తెలివితేటలకి మెచ్చుకుంటూ మనసులో ఆమెకు కృతజ్ఞతా పూర్వక నమస్కారము లర్పించాడు.

తరవాత అరగంటసేపువారిసంభాషణ సాగింది. సుందరి వారిమాటలను నిశ్శబ్దంగా వింటూ మధ్యమధ్య భర్తవైపు చురుకు చూపులను ప్రసరిస్తూ ఉండేది.



"మధ్యమధ్య భర్తవైపు చురుకు చూపులను ప్రసరిస్తూ ఉండేది"

ఆమె మనసులో ఏ భావాలు రేకెత్తుతున్నాయో చెప్పడం కష్టం.

అయిదుగంటలుకానిచ్చి మహాలక్ష్మమ్మ వంటకి వేళయిందని లోపలికెళ్లడానికి లేచింది. ఆమెవెను వెనుకనే కుమార్తెకూడా లేచింది. వెళ్లిపోవస్తున్నావు కాని అతడు ఓవల్టయిను తాగలేదు. కాఫీకావాలేమో కాస్తచేసి ఇయ్యి. అలవాటైన వాళ్లకి కాఫీ లేకపోతే తలనొప్పి వస్తుంది యీ రోజుల్లో” అని కుమార్తెతో చెప్పింది మహాలక్ష్మమ్మ.

మరి పదినిముషాల్లో కాఫీచేసి తీసుకొచ్చింది సుందరి. కొంచెంమారంలో ఉండగానే ఆమెరాకని గ్రహించాడు శాస్త్రి. ఈసారిఅత్తగారుదగ్గిర లేదు గనుక ధైర్యం చేసుకొని భార్యతో మాట్లాడాలని నిశ్చయపరిచేసుకున్నాడు. కాని ఏమాట ముందు అనాలో సిరపడకముందే సుందరంవచ్చి కాఫీగ్లాసు అక్కడ ఉంచేసింది. ఏది ఆలోచించడానికీ టైము లేదు. ఆలస్యం చేస్తే ఆవిడ లోపలి కెళ్లిపోతుంది అందుచేత ఆ తొందరలోనే కొంచెంతడబాటుగా “కొంచెం మంచి నీళ్లుకూడా ఉంటే బాగుండును!” అనేశాడు.

ఆ తళుకు చూపులనుఒక్కసారి భర్త ముఖం మీదికి గురిచేసింది. మందహాసమొకటిఆవిశాలనేత్రాల్లో తొణికిసలాడింది. మంచినీళ్లు తేవడానికి లోపలికి వెళ్లింది సుందరం.

పైమూడుమాటలూ అన్నపిమ్మట ఎంతో పెద్ద పనిచేసి అలిసిపోయిననాడిలాగ శాస్త్రి ఒకనిట్టూర్పు పుచ్చి కుర్చీలో చేరబడ్డాడు. ఈ మంచినీళ్ళు యిచ్చేసి ఆమె లోపలికి మళ్లీ పారిపోతే ఏమిటిదారి? ఈసారి వచ్చేటప్పుడు ఈడొంకతిరుగుళ్ళు మానేసి స్పష్టంగా ఆగమని చెప్పెయ్యాలి. మొగమోటానికీ, మోక్షానికీ చాలాదూరం.

మంచినీళ్లు వచ్చాయి. కంఠం సవరించుకుని శాస్త్రి “కొంచెంసేపు యిక్కడ వుండకూడదేమిటి?” అని చివరమాటలు మింగేశాడు. లోపలకు పోబోతూ వున్న సుందరం నిలబడిపోయి “పకోడీలుకూడా తినలేదేం?” అని గొణగేసింది. ఈ ప్రశ్నలు రెండూ అంతసందర్భంగా లేవు. కాని ఒకరితో ఒకరు మాట్లాడుకొందుకు యిద్దరికీ లోపలవున్న వుబలాటం మాత్రం స్పష్టపడిపోయింది.

కాఫీ పుచ్చుకుంటున్నంతసేపూ గోడకి జేర్లాబడి నిల్చున్న సుందరంవేపు చూస్తూనే ఉన్నాడుశాస్త్రి. పారాణి గురుతులుమాయని పాదాలపైని జరీఅంచులు చిందులాడేటట్లు గులాబీ రంగు చీరను కట్టుకుంది. పొట్టి చేతులుగల నల్ల సిల్కు రవిక బిగువైన శరీరానికి మరింత బిగువును కలిగించి మిసమిసలాడే యౌవనపుశరీరపు కాంతులను ప్రస్ఫుటపరుస్తూంది. విజయనగరంనుంచి శాస్త్రి తెచ్చిన పువ్వులు కళాదృష్టితో అర్ధచంద్రాకృతిగా అమర్చబడి ఆమెసిగను అలంకరించాయి. నాలుగైదు రకాల బంగారపుగొలుసులు ఆ నల్లనిరైకమీద ప్రకాశిస్తున్నాయి. ఎంతధైర్యవంతుడగు పురుషుని బింకమైనను శిరమువంచవలసిన మేలుజాతి సౌందర్యము ఆమెది.

“ఇల్లా కూర్చోకూడదూ?” అన్నాడు ముగ్ధుడై పోయి శాస్త్రి చాపను కుర్చీకి దగ్గిరసా లాగి”

చాపమీద కూర్చుంది సుందరం. అయిదు నిముషాలు నిశ్శబ్దం. చివరకి ఏమి అనడానికీ తోచక శాస్త్రి “నే నీవేళ వస్తా ననుకున్నా రేమిటి?” అని అడిగాడు.

ఎప్పటికప్పుడే అల్లా అనుకుంటున్నాం”

... ...

“యిన్నాళ్లకి దయకలిగింది కాబోలు?”

“మమ్మలిని ఎప్పుడైనా తలుచుకు నేవారా?”

“స్త్రీ తలుచుకుంటే మాత్రం ఏం లాభం ఉంటుంది? ఏంచెయ్యడానికీ స్వతంత్రురాలు కాదుకదా?”

“నామీద కోపంవచ్చిం దనుకుంటాను”

... ...

“నేనూ ఇంకా అస్వతంత్రుణ్నే కదూ”

“అయినా స్వతంత్రత కావాలన్నపుడు పొందగలరు మొగాళ్లు. ఇన్నాళ్లకేనా జ్ఞాపకాని కొచ్చాం. అంతే సంతోషం”

"నేను తండ్రిచాటువాణ్ణవడంచేత యిక్కడికి రాలేకపోయినా, భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను- నా హృదయం మాత్రం—" శాస్త్రి కుర్చీదిగి ఆమె సమీపానికి చాపమీదకి వెళ్లాడు. అతనిచెయ్యి ఆమె కంఠాన్ని పెనవేయబోయింది.

బెదురుచూపులతో సుందరం సాభిప్రాయంగా వంటయింటివేపు దృష్టి తిప్పింది. "అమ్మ కేంగావాలో చూసి మళ్లావస్తాను" అంటూ లేచింది ఆమె.

ఆమెచెయ్యిపట్టుకుని కూర్చోపెట్టి నవ్వుతూ శాస్త్రి "పోనీ. కూర్చుంటేసరి. మరి నేను కుర్చీదిగను ఇంక" అన్నాడు.

అప్పటినించీ వారి సంభాషణ నిరంతరాయంగా సాగిపోయింది. సంధ్యచీకట్లు వసారా నాలుగుమూలలా ఆక్రమించుకుంటున్న సంగతి వారు గమనించనేలేదు.

✂

నారాయణమూర్తి విజయనగరంలో బాగా పేరుమోసిన వకీలు. బాగా చదువుకున్నాడు. విజయనగరానికి కొన్నాళ్లు ఛైర్మెను పనిచేసాడు. కళాశాల వార్షికోత్సవాల్లోనూ, టౌనుహాల్లో జరిగే సభలలోనూ అధ్యక్షత వహించేటప్పుడు అతన్ని ఎరుగును విశ్వేశ్వర శాస్త్రి. అతడు శాస్త్రికీ మహాలక్ష్మమ్మకీ కూడా బంధుకోటిలోవాడు. మొగమోటమిచేత శాస్త్రి ఎన్నడూ నారాయణమూర్తియింటికి వెళ్లలేదు యీవరకు. కాని ఆయనయందు విశేష గౌరవం ఉంది అతనికి.

ఒకనాటిరాత్రి తొమ్మిదిగంటలవుడు శాస్త్రి గదిలో చదువుకుంటూ ఉండగా నారాయణమూర్తిగారెందుకో రమ్మన్నారని నౌఖరు వచ్చి చెప్పాడు. కేవలం విద్యార్థి అయిన తనతో ఆయనకు పనియేమిటా అని ఆలోచించుకుంటూ అతడు వకీలుగారి యింటికెళ్లాడు.

అప్పటికి నారాయణమూర్తి కచేరీ సావిట్లో పేపరుచూస్తూ కూచున్నాడు. తనకు నమస్కారంచేసి నిలబడిన శాస్త్రినిచూసి ప్రసన్నవదనంతో "ఏమోయ్! వచ్చావా? దా, మేడమీద కెళదాం. కొంచెం మాట్లాడాలి." అంటూ పైకి తీసుకుపోయాడు.

మేడమీద హాలులో ఇద్దరూ కుర్చీలలో ఆసీనులైనారు. నారాయణమూర్తిభార్య రాజేశ్వరమ్మకూడా వచ్చికూర్చుంది. అప్పుడాయన శాస్త్రివేపుచూసి యిల్లా చెప్పాడు." "అబ్బాయీ! నువ్వు ఈ కాలపు కుర్రవాడవైనా పెద్దతరహాబుద్ధి కలవాడవని నాకు తెలుసును. మీతాతగారంటే నాకు గురుసమానులు. మీ నాన్నా, నేనూ చాలాకాలం కలసి చదువుకున్నాం చిన్నప్పుడు. నాయందు నీకు గల గౌరవభావాన్ని ఇదివరకనేకసార్లు నేను చూసేవున్నాను. నీకుటుంబంయందు నాకున్న అభిమానంచేతనూ, నువ్వు నా మాట వింటావనే నమ్మకంచేతనూ ఒకవిషయం నీతో చెబదామని నిన్ను పిలిపించాను. చెప్పమంటావా?"

వ్యవహారజ్ఞానంలో పండిపోయినశిరస్సూ, తీక్ష్ణములై కాంతివంతములైన కళ్లూ, వాటిపైని దీపపు కాంతిలో తళతళ మెరిసే బంగారపు కళ్లజోడూ, సుకుమారమై, గంభీరమై దబ్బపండుచాయశరీరమూ గలిగి నారాయణమూర్తిది యెదుటివారలగౌరవాన్ని ఆకర్షించే స్వరూపము. శాస్త్రి నమ్రశిరస్కుడై "సెలవియ్యండి. మీమాటకు అడ్డుచెప్పడానికి నేనెంతవాణ్ణి" అన్నాడు.

"ఆ నమ్మకంమీదనే కదూ కబురంపాను మరీ. అయితే సంగతి విను. మీ అత్తగారు మహాలక్ష్మమ్మ మొన్న నాదగ్గిర కొచ్చి విషయమంతా చెప్పింది. ఇల్లా మనలో మనం కలహించుకోవడం నాకు నచ్చలేదు. ఇందులో మీనాన్న కేవలందౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నాడు గాని మరొకటికాదు. కొంచెం చదువుకున్న వాళ్లమైనందుకు మనం ఇలాంటి దౌర్జన్యాలని ధైర్యం వహించి అరికట్టాలి. లేకపోతే మన Education (విద్య) ఉత్త Waste (వ్యర్థము) అన్నమాట. అందులోనూ పాపం మొగదిక్కులేని స్త్రీని బాధపెట్టడం సోమయాజికి బాగులేదు.

"ఇప్పుడు నేను చెయ్యదలుచుకొన్నదేమిటంటే రేపువచ్చే బుధవారంనాడు మీనాన్నని ఇక్క

డికి రమ్మని కబురుచేస్తాను. మీ అత్తగారుకూడా వస్తుంది. ఆవేళ సోమయాజికి నచ్చజెప్పి మీ రెండు కుటుంబాలనీ కలిపెయ్యాలని నాకోరిక. ఏం?ఇందుకు నీ కిష్టమేనా?" "చిత్తం. కాని మా నాన్న వినడేమో అని సందేహం."

"వినకపోతే దానికి తగిన మార్గం ఆలోచించే ఉంచాను. నేను చెప్పినట్లూ వింటానని నువ్వు వాగ్దానం చేస్తే చాలు నాకు. మిగిలిన విషయం నేను చూసుకుంటాను. నీ అభిప్రాయం చెప్పు."

అంత పెద్దమనిషి, ఊరంతకీ గౌరవనీయుడు చెబుతున్న పుడు కాదనడానికి మనసు ఒప్పలేదు శాస్త్రికి. "కానియ్యండి. మీ సెలవుప్రకారమే నడుచుకుంటాను. మానాన్నకి కోపంవస్తుందేమో అనే నా భయం" అన్నాడు.

"ఆ. పరవాలేదు తరవాత అన్నీ అవే సర్దుకుంటాయి. నీకేబాధా రాకుండా చూసేపూచీ నాది." అని భార్యతో "చూశావా, నేను చెప్పానుకానూ. కుర్రాడు బహు యోగ్యుడు." అని మందహాసముచేశాడు."ఏమోయ్‌శాస్త్రీ !ఆవేళ నువ్వు హోటలులో భోజనంచెయ్యకు. I request you to dine with me (ఆనాడు నువ్వు మాయింట్లో భోజనం చెయ్యాలని కోరిక) మనందరం కలిసి తిందాం." అన్నాడు.

శాస్త్రి సెలవుపుచ్చుకు నేసరికి పదిగంటలయింది.

*   *   *   *   *

బుధవారంనాడు తెల్లవారేసరికి మామిడితోరణాలతో,పసుపుకుంకుమలు పెట్టిన గుమ్మాలతో వకీలు నారాయణమూర్తియిల్లు లక్ష్మీకళ లొలుకుతూంది. దాసదాసీజనమంతా అడావిడిగా తిరుగుతూంది. వంటలక్కమామూలుకంటే పెందరాళేవచ్చి వంటశాలలో ప్రవేశించింది. బంట్రోతు అడిగినవాళ్ళందరితోనూ "అయ్యగారి పెద్దఅమ్మాయిగారి పుట్టినరోజు ఈ వేళ" అని చెబుతున్నాడు.

ఎనిమిదిగంటలకు నారాయణమూర్తిగారి నౌఖరు హోటలుకివచ్చి 'పంతులుగారు రమ్మన్నార' ని శాస్త్రికి జ్ఞాపకంచేశాడు. పెద్దవారింటికి కాస్త యిదిగానే వెళ్లాలని అతడు బాగా శృంగారించుకొని మరీ సైకిలుమీద వెళ్లాడు. గుమ్మంలో అతన్ని చూడగానే బంట్రోతు "అయ్యగారు మేడమీదికి దయచెయ్యమన్నారు." అని చెప్పాడు

మేడమీద హాలులో పేముకుర్చీలమీద నారాయణమూర్తీ, సోమయాజీ కూర్చునిమాట్లాడుతున్నారు. ఎదురుగా ఉన్న గదిగుమ్మంలో మహాలక్ష్మమ్మ కూర్చుంది. ఆవిడవెనకని రాజేశ్వరమ్మ ఇంకా ఒకరిద్దరు స్త్రీలూ ఉన్నారు. తండ్రిని చూడగానే శాస్త్రి కొంచెం సందేహించాడు అక్కడికెళ్లడానికి. కాని నారాయణమూర్తి Come on, Please be seated (దా. కూర్చో) అని ఆహ్వానించి కూర్చోపెట్టాడు.

అప్పటికప్పుడే నారాయణమూర్తి సోమయాజితో వ్యవహారంఅంతా మాట్లాడేశాడు. తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించినప్పటికీ చిన్ననాటి స్నేహితుని మనస్సు తిప్పలేకపోయాడు వకీలుగారు. మహాలక్ష్మమ్మకూడా బతిమాలుకుంది. సోమయాజులు పట్టు విడవలేదు. పైగా అతనికి నారాయణమూర్తిమీద కోపంవచ్చిందికూడాను.

"నన్నింతా పిలిపించి ఇదిటోయ్ నువ్వు చెప్పే న్యాయం? ఇంకా యెందుకో అనుకున్నాను నేనూ. నామాట జరక్కపోయినప్పుడు ఆలోచించుకుందాంలే" అంటూ కుర్చీమీదనించి లేచాడతను.

నారాయణమూర్తి ముఖముపై నున్న శాంతభావమేమీ చలించలేదు. సోమయాజిగోపాన్నీ, పల్లెటూరు కేకలనీ చూసి నవ్వుతూ "పోనీ,నామాట వినకపోతే మానిపోయిందికాని యీ పూట ఇక్కడ ఉండిపోవయ్యా. మనం కలిసిభోంచేసి చాలకాలమైపోయింది." అని మరీమరీ చెప్పాడు.

"బావా! నన్నెందుకు బలవంతపెడతావు? ఇంటిదగ్గిర బోలెడంతవ్యవహారంమానుకునినీమాటతో సెయ్యలేక వచ్చేశాను- తిరుగుబస్సుమీద వెళ్ళిపోకతప్పదు. భోజనానికి మరిరానాయేమిటి?" అనుకుంటూ మేడ దిగి పోయాడు.



నారాయణమూర్తీ, శాస్త్రీ అతన్ని వీథిగుమ్మందాకా దిగబెట్టారు. కుమారుడితో కుశలప్రశ్నలు మాత్రం జరిగించి కొంత సొమ్ము అతనిచేతి కిచ్చి సోమయాజితొందరతొందరగా బస్సుస్టాండువేపుకి వెళ్లిపోయాడు. అతడు వెళ్ళగానే నారాయణమూర్తీ, శాస్త్రీ తిరిగీ మేడయెక్కారు.

అప్పుడు నారాయణమూర్తి "చూశావా? మీ నాన్నకి చిన్నప్పటినించీ యిదేగుణం. పట్టూవిడుపూ ఉండాలి వ్యవహారానికి. పోనీలే. ఇంక్య మనకి నిష్ఠూరం ఉండకుండా చేశాను కాని అతని పద్ధతి యింతేఅని నాకు ముందే తెలుసునులే. స్నానంచెయ్యి. భోంచేద్దాం" అని చెప్పాడు.

"నాస్నానం ఉదయాన్నే అయిపోయింది."

"అదిగాదు. ఈ వేళ మా పెద్దమ్మాయి జన్మదినం. ఇంటికివచ్చినచుట్టాలందరూ అభ్యంగనం చెయ్యాలి. అడ్డుచెప్పకూడదు. కాని ఇప్పుడే చెబుతున్నాను సుమా. ఏకంగా రాత్రికూడా యిక్కడే భోంచేసి వెళ్ళవాలి నువ్వు We shall spend a holiday (మనం హాయిగా విశ్రాంతిగా గడుపుదాం)."

రాజేశ్వరమ్మ ఆజ్ఞాప్రకారం నౌఖరు శాస్త్రిని స్నానశాలలోకి తీసుకుపోయాడు. కారాకిల్లీనవులుతూ ఒడ్డిమంగలాడు తలంటేశాడు. స్నానంచేస్తున్నపుడు సుందరమ్మలాగే ఒక అమ్మాయి లోపలద్వారంలోనించి కనబడ్డాది అతనికి. అత్తగారు ఆమెనుకూడా తీసుకొచ్చిందేమో అనుకున్నాడు. మళ్లీ "వకీలుగారి పెద్దమ్మాయి కాబోలు ఆవిడ. సుందరి యిక్కడికొస్తే అత్తగారు నాతో చెప్పకుండాఉంటుందా?" అని సమాధానపడిపోయాడు తనలోతనే.

"శాస్త్రికినోట మాల

మధ్యాహ్నం నాలుగుగంటలకి ఫలహారాలవనిచ్చి శాస్త్రిని కారులో కూర్చోపెట్టుకుని నారాయణమూర్తి ఊరుకి నాలుగుమైళ్ళదూరంలో ఉన్నతోటకి షికారు తీసుకుపోయాడు.

లేదు. పాతవిగ్రహము."

రాత్రి భోజనాలైనతరవాత మేడయెక్కేసరికి హాలూ, దానిపక్కనున్న గదీ వింత వింత అలంకారాలతో, విద్యుద్దీపాలకాంతిలో మెరిసిపోతూ వాళ్ళకి క్రొత్తగా కనిపించాయి. శాస్త్రి ఆ గదిని అదివరకుచూసి ఉండలేదు. నారాయణమూర్తి స్వయంగా గదిలోకి వెళ్లి అలంకారాలను పరీక్షిస్తున్నాడు.

విశాలమై నాలుగుకిటికీలతో ఆరోగ్యశాస్త్రవిధుల ననుసరించి కట్టిన గది అది. ఒకద్వారము హాలులోకీ, ఇంకొకటి డాబామీదకీ తెరుచుకునిఉన్నాయి. గదిలో నాలుగుగోడలకీ నిలువుటద్దాలు. అనేకరకాల చిత్రాలు కళాకౌశలంతో అక్కడక్కడ తగిలించబడి ఉన్నాయి. కిటికీసమీపంగా పెద్దపందిరిమంచము, ఎత్తైన పరుపులతో ఒకవేపున ఉన్నాది. చెయ్యివేస్తే మురికిఅయిపోతుందేమో అనిపించేటంత తెల్లని దుప్పటీ పరిచిఉంది. తలవేపున రెండుపూలదండలు. ఎదురుగా మేజామీద తాంబూలపుసామాను. అగరువత్తులు, అత్తరుపెట్టె. గదికి మధ్యగా మిక్కిలి ప్రకాశమానమైన విద్యుద్దీపము పైకప్పునించి వేలాడుతూంది. గది అంతటా గుమ్మని సెంట్లసువాసన తల దిమ్మెత్తిపోయేలాగున ఉంది.

"నారాయణమూర్తిగారు అదృష్టవంతుడు. గొప్ప అనుభవశాలి" అని నిట్టూర్పుపుచ్చి కుర్చీలోకూలబడ్డాడు శాస్త్రి ఈ వైభవమంతాచూసి. అంతలో మేడమీదకి వచ్చిన రాజేశ్వరమ్మని చూసి సాభిప్రాయంగా "ఎలాగైనా కలెక్టరుగారి కూతురువి. నీయేర్పాట్లు బాగుండక పోవడమేమిటి ?" అని నారాయణమూర్తి హాస్యోక్తులాడాడు. ఆవిడ మాత్రం మందహాసంచేసి బల్లమీద ఉన్న వాసననూనెసీసాను తీసుకొని మేడదిగిపోయింది.

కొంతసేపు సంభాషణ కానిచ్చి "సెలవిప్పిచ్చండి" అన్నాడు శాస్త్రి లేచి. నారా

యణమూర్తి "వెళ్లొచ్చులే. మరి యిప్పుడు వెళ్లిమాత్రం చేసే దేముంది, పడుకోవడమేకదా? ఒకసారి పద్యాలు వినాలని ఉంది. కాస్త వినిపిస్తావేమో అని. నువ్వు రాసిన ఇక్కడే పడుకుని పొద్దుటే వెళ్లు" అన్నాడు.

కోరేవాడుంటే చాలు కవులకి విసుగుపుట్టదు పద్యాలు వినిపించడానికి. అందులో అంత పెద్దవాడు కోరినపుడు ఇంక సందేహమేముంది? శాస్త్రి రాగజ్ఞానంతో మనోహరంగా తన పద్యాలనూ, ఇతరులు రాసినవాటినీకూడా చదివాడు గంటసేపు.

పదిగంటలు దాటనిచ్చి నారాయణమూర్తి "శాస్త్రి! అదుగో ఆగదిలో పడుకో. ఇప్పుడు హోస్టలు కెందుకు ఈ అర్ధరాత్రివేళ" అని అంతకు కొంచెంసేపుకిందటే శాస్త్రిలో అసూయను (Jealousy) పుట్టించిన ఆపడకగదినే చూపించాడు.

శాస్త్రి కొంచెం సందేహించాడు. "సందేహిస్తావేం? వెళ్లవోయ్. పరవాలేదు." అంటూ ప్రేమ వాత్సల్యము లుట్టిపడే కంఠస్వరంలో చెప్పి అతనిచేయి పట్టుకుని ఆగదిలోకి తీసుకుపోయాడు. అందులో గోడలపైనున్న చిత్రాలు కొన్ని వారిదృష్టిని ఆకర్షించాయి. అప్పుడు వాటిలో కొన్నిటి ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ, వాటిని రాసిన చిత్రకారులనూ, ఆచిత్రాలు పొందిన బహుమతులనూ, అవి ప్రదర్శింపబడిన స్థలాలనూ నారాయణమూర్తి శాస్త్రికి వివరించి చెబుతున్నాడు.

ఇంటివెనక ఉన్న పూలతోటపైనుండి చల్లగాలి ధారాళంగా వీస్తూంది. పైని మనోహరమైన చంద్రకాంతి జగత్తుపైని పాలవర్షము కురిపిస్తూంది. ఆకాశము స్వచ్ఛనీలమై, నిర్మలమై. ఉజ్జ్వలమై ఉంది.

ఒక్కక్షణముందుగా "ఈ గదిలోనిద్రించే నారాయణమూర్తిగారిదే అదృష్టము" అని నిట్టూర్పువిడిచిన కవికుమారుడికి ఇదంతా చూసి తానందులోనే పడుకోవడమని తెలిసినతరవాత ఆ గదిలోనే తాను తెల్లవార్లూ వేగించడ మెల్లాగ అన్న బెంగకూడాపట్టుకుంది.

ఇంతలో గది ప్రధానద్వారముదగ్గిర కొంచెంసందడి వినబడింది. శాస్త్రి వెనక్కి తిరిగిచూశాడు అదియేమిటో అని.

అప్పటి అతని ఆశ్చర్యాన్ని వర్ణించడానికి తగిన వాగ్జాలము లేదు. లజ్జావనతవదనయై, అలంకృతయైన సుందరమ్మని చెయ్యిపట్టుకుని నడిపిస్తూ రాజేశ్వరమ్మ ప్రవేశించింది గదిలోకి ముందుగా. తరవాత నలుగురైదుగురు యువతులు శాస్త్రి ఎన్నడూ ఎరగనివారున్నారు. అందరికీ వెనక మహాలక్ష్మమ్మ హర్షాశ్రువులతో నిల్చున్నాది. రాజేశ్వరమ్మ భర్తతో "ఇంకా మీ సంభాషణ తేలలేదుకాబోలు?" అంది ఏమీయెరగనివాడిలాగు నారాయణమూర్తి నవ్వుతూ శాస్త్రితో "ఇదేమిటోయ్, ఆడవాళ్ల అధికారానికి అంతంలేనట్టుంది. ఇక్కడకూడా మనలని మాట్లాడుకోనియ్యరుకాబోలు" అన్నాడు.

శాస్త్రికి నోట మాటలేదు. పోతవిగ్రహమై.

గదిఅవతలకి పోయే భర్తని చూసి రాజేశ్వరమ్మ "వెళ్లకండి కొంచెం ఆగండి" అని అధికారంతో అన్నది.

"అబ్బో! కలెక్టరుగారి అమ్మాయి మమ్మలిని ఖైదుచేస్తుందికాబోలు యీ గదిలో."

"హేమాహేమీలు శ్రీకృష్ణజన్మస్థానానికి వెళుతూఉంటే మీకు తప్పొచ్చిందాయేమిటే? మీకు పదినిముషాలూ, మీతో ఉన్న అబ్బాయికి తెల్లవార్లూనూ ఈ గదిలో ఖైదుతప్పదు" అంది రాజేశ్వరమ్మ నవ్వుతూ.

"జైలుశిక్ష వేస్తే వేశావుకాని, ఏకాంతవాసశిక్షమాత్రం వెయ్యకు శాస్త్రికి నీపుణ్యముంటుంది."

"ఇంకొక అరగంటసేపు అతని నడవడికను చూస్తాము. ప్రవర్తన సరిగా ఉంటే ఈ అమ్మాయిని (సుందరాన్ని చూపిస్తూ) కూడా సహాయంపంపిస్తాంలెండి. మీ కెందు కంతవిచారం?"

రాజేశ్వరమ్మ సుందరాన్ని శాస్త్రికిసమీపంగా నిల్చుంపబెట్టింది. ఉదారహృదయులైన నారాయణ మూర్తిదంపతులు లజ్జావనతశిరస్కులైయున్న శాస్త్రీ సుందరమ్మలపైని పవిత్రాక్షతలను జల్లి ఆశీర్వదించారు.

*　　*　　*　　*　　*

సోమయాజి నారాయణమూర్తితో జన్మవిరోధ మేర్పరిచేసుకున్నాడు. కుమారుడు సెలవుల కింటికివచ్చినపుడు అతనిముఖం చూడ్డానికి నిరాకరించేశాడు.

"సంఘంలో దురన్యాయాలు జరిగినపుడు చూస్తూఊరుకోవడం మనకి అలవాటైపోయింది. అందుచేతనే సంఘంలో కుళ్లు బలిసిపోయింది. మధ్యవర్తులైన వాళ్లు ధైర్యంగా న్యాయంవేపు నిలబడి పోరాడితేగాని దేశం బాగుపడదు. ఈవిషయంలో నేను కేవలం నావిధిని నిర్వర్తించాను అనే నానమ్మకం. ఇందులో ఎవరిమనస్సుకి కోపంకలిగినా నాకు లక్ష్యంలేదు." అంటూ నారాయణమూర్తి తనప్రవర్తనకు సమాధానం చెప్పేవాడు.

అన్వేషణము

కొమర్రాజు వినాయకరావు
(నవ్యసాహిత్య పరిషత్తు)

రాధికా! రాధికా!
మాధవుడనే నేను!
కోపమేటికే? నిన్నె
కోరి వెదకెదనే.

మధుర బృందావనీ
మధుమాస సంఫుల్ల
మందార మృదు పథా
లందు జూచితినే!

ముత్యాల మల్లె పూ
మొగ్గ లరకనువిచ్చి
మురియు మంటపవితతి
మున్గి తేలితినే!

పక పక నగు కల్వ
పడతుల కొలకుల
కెలకుల నీపాద
ములె కంటబడెనే!

నీ యంఘ్రిముద్రలో
నే యడుగునిడికొంచు,
వేణువనమున దారి
వేసారినానే!

నా కొరకునై యెంత
నవసి కృశియించితో?
నయనాల ఘను లెన్ని
నాట్య మాడెనో కో?

ఎంతగా తపియించి
వంత యెదపూరించి,
వెఱ్ఱివై ప్రేమకై
వెదకులాడితివో?

అపరాధినే చెలీ!
యగు తప్పనాదె; నే
వచ్చెదనని రాక
వంచించినానే!
రాధికా! రాధికా!
మాధవుడనే నేను!